క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



చాకిరేవు మెరకలో కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాజులూరు శెట్టిబలిజ పేటలో సోమవారం జరిగిన ముత్యాలమ్మ జాతరలో మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని చాకిరేవు మెరకలో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపానికి మంత్రి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, టేకుమూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అశిరాంబ వారి తీర్థం

కపిలేశ్వరపురం: అంగర గ్రామ దేవత అశిరాంబ వారి తీర్థాన్ని ఆలయం వద్ద సోమవారం వైభవంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, వెదురుమూడి, టేకి గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థంలో పాల్గొన్న భక్తులు అక్కడ ప్రదర్శించిన ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు తిలకించారు. ఆలయ నిర్వాహక కమిటీ నాయకుడు రాగం రామచంద్రరావు పర్యవేక్షణలో గ్రామానికి చెందిన పెద్దలు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

పార్టీ బలోపేతానికి ఇంటిగ్రేటెడ్ శిక్షణ దోహదం

మండపేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా టీడీపీ బలోపేతానికి ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ - 2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, అమలాపురం పార్లమెంటరీ టీడీపీ కో- ఆర్డినేటర్ మానేపల్లి బాలాజీ వేమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ



కంచాలు పంపిణీ చేస్తున్న దాత కిషోర్‌రెడ్డి

రామచంద్రపురం: ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పథకానికి విద్యార్థులకు దాత కంచాలను పంపిణీ చేశారు. పట్టణంలోని కృత్తివెంటి జాతీయోన్నత పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం స్టీల్ కంచాలను అనపర్తికి చెందిన కర్రి కిషోర్‌రెడ్డి బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు తాడి వీర్రాఘవరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు బుక్స్ అందిస్తున్న సర్పంచ్ సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు

మండపేట: మండలంలోని మెర్నిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆ పంచాయతీ సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కుమార్ దంపతులు నోట్‌బుక్స్, పెన్సిల్ బాక్సులు అందజేశారు. సర్పంచ్ సౌజన్య జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. తొలుత పార్టీ కార్యాలయంలో సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు పంపన బుల్లియ్య, చల్లా మోహన్, బుంగ వెంకటరమణ, నూకపెయ్యి రమేష్, శనగల శ్రీను, పంపన కిట్టయ్య, మణికంఠ, కొయ్యల నాగేశ్వరావు, చల్లా రమేష్, కోరుమిల్లి శివ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

రాయవరం: మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో కొత్తగా నియమితులైన వలంటీర్లకు ఎంపీపీ నౌడు వెంకటరమణ సోమవారం నియామక పత్రాలు అందజేశారు. వివిధ గ్రామాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో ఎంపికైన 8 మందికి నియామక పత్రాలు అందజేశారు.

తాగునీటి లభ్యతపై అవగాహన

కపిలేశ్వరపురం: తాగునీటి లభ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మండపేట నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సోమవారం కేదారిలంక గ్రామంలో తాగునీటి ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులకు తాగునీటి పరీక్ష చేసే విధానంపై సచివాలయ ఈఏ ఎస్.పద్మరాజు శిక్షణ ఇచ్చారు.

వరదల వేళ.. పశు సంరక్షణ ఇలా..

- అప్రమత్తత ఎంతో అవసరం
- ఉధృతమవుతున్న గోదావరి వరద
- ఆహారంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి



కేదారిలంక వరదలో పశువులు (ఫైల్)

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నది ఉప్పొంగుతోంది. రోజు రోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. ఏటా ఇదంతా సహజమే అయినా గోదావరి నదీ గర్భంలోని లంక గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నివాసిత ప్రాంతాలతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లోని పశువుల సంరక్షణ బాధ్యత సైతం లంక వాసులపై ఉంటుంది. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువుల సంరక్షణపై కపిలేశ్వరపురం పశువైద్యాధికారి ఇందు ప్రియ సూచనలిలా...

లంక గ్రామాల పరిస్థితి ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గం కె.గంవరం మండలం శేరిలంక, మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం కేదారిలంక పంచాయతీ పరిధిలోని శేరిగూడెం, వీధివారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, కోరుమిల్లిలంక గ్రామాలు దాదాపు గోదావరి నదిలో ఉన్నాయి. ఇవేగాకుండా కె.గంగవరం మండలం పరిధిలోని కూళ్ల, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి, కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. పశువులను వ్యవసాయ క్షేత్రాల నుంచి నివాస ప్రాంతాలకు తరలిస్తుంటారు.

నియోజకవర్గంలో పశువులిలా...

నదీ తీర ప్రాంతం అధికంగా ఉన్న మండపేట నియోజకవర్గంలో 28,975 గేదెలు, 5,723 ఆవులు, 3,451 గొర్రెలు, 2,942 మేకలు ఉన్నాయి. వీటిలో అధిక శాతం పశువులను రైతులు లంక పొలాల్లో సంరక్షిస్తుంటారు.

వాతావరణ మార్పుల ప్రభావమిలా...

వరద సమయంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం, రోజుల తరబడి చల్లని గాలి ఉండడం, తడి నేలతో చెమ్మగా ఉండటం, ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహంలో మృత కళేబారాలు కొట్టుకు రావడం తదితర కారణాలు పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలి

వరద పరిస్థితుల్లో దొమ్మ, జబ్బవాపు, ఆంత్రాక్స్ వంటి వ్యాధుల బారిన పశువులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వరదకు దెబ్బతిన్న పచ్చిక బయళ్లలోని గడ్డిని, బూజుపట్టిన ఎండు గడ్డిని తినకుండా చూడాలి. కలుషిత మైన నీటిని తాగడం వల్ల జీర్ణకోశ వ్యాధులు వ్యాపిస్తాయి. నీటిలో ఉండడం వల్ల వాటి గట్టలు, కాళ్ళకు పలు వ్యాధులు వస్తాయి. నీటి కుంటలు ఏర్పడడం వల్ల దోమలు, కీటకాలు కారణంగా దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. వ్యాధుల బారినపడితే పాల దిగుబడి తగ్గడంతో పాటు పొదుగు వాపు వ్యాధి కూడా వస్తుంది. 105 డిగ్రీల జ్వరంతో బాధపడడం, ఊపిరి ఆడక ఇబ్బంది పడటం వంటి లక్షణాల ద్వారా గొంతు వాపు వ్యాధిని గుర్తించ వచ్చు. సకాలంలో స్పందించకపోతే గొంతు పూడుకుపోయి గాలి ఆడక పశువు చనిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా టీకా వేసిన ఆరు నెలలు వరకూ మందు పనిచేస్తుంది. వరద పరిస్థితి తీవ్రంగా ఉంటే ఆరు నెలల లోపే మరో డోసు వేసినా ఇబ్బంది ఉండదు.

వరద వీడిన తర్వాత ఇలా...



వరద వీడిన వెంటనే పశువు కాళ్లు, గిట్టలను క్షుణ్ణంగా పరిశీలించాలి. నడిచే స్థితిని బట్టి ఆరోగ్య స్థాయిని అంచనా వేయొచ్చు. వరద పరిస్థితి చక్కబడిన వెంటనే పెద్ద మొత్తంలో ఆహారాన్ని అందించకుండా క్రమక్రమంగా ఆహార పరిమాణాన్ని పెంచుతూ ఉండాలి. ధాన్యం, పిండి వంటి పదార్థాలను నేరుగా పెట్టరాదు. బురద లేని చోట పశువులను కట్టుకోవాలి. పాలను క్రమం తప్పకుండా తీస్తుండాలి. పొదుగు వాపు ఉంటే వైద్యం చేయించాలి.

ఇందుప్రియ, పశువైద్యాధికారి

రెండు పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



నల్లూరులో వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరుకు చెందిన ఖండవిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుమారు 50 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో చేరిన వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సేవా దృక్పథం ఉన్న వారు వైఎస్సార్ సీపీలో పనిచేయడం ద్వారా ప్రజలకు ఎక్కువ సేవ చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా చూసుకుంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ వల్లూరి సూర్యవెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, శివ, మార్ని పూసబ్బు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, డైరెక్టర్ కురుపూడి భువనేశ్వరి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వి.అశోక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. కాజులూరులో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే మిన్నగా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలను ఏర్పాటు చేసి అనేక పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు రైతులకు వ్యవసాయ యాంత్రిక విధానం, ఆధునిక పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చి అవగాహన కల్పిస్తుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడుల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండంగి సరోజని, ఉప సర్పంచ్ డి.చిన్నారావు, వీఏఏ పేపకాయల సాయికిశోర్, పలువురు స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాల వివరాలు

రాయవరం: మండలంలోని చెల్లూరు-3, సోమేశ్వరం-1 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. జగనన్న సురక్ష శిబిరాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే జగనన్న సురక్ష శిబిరాల్లో ప్రజలకు అవసరమైన 11 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

దేశాన్ని ఆలోచింపజేస్తున్న జగన్ పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- టేకిలో 'గడప గడపకూ'

కపిలేశ్వరపురం: సచివాలయ, వలంటీర్ వ్యవస్థల రూప కల్పనతో క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పేద, మధ్య తరగతి ప్రజలందరికీ సంక్షేమాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశాన్ని ఆలోచింపజేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని టేకి గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, సొసైటీ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులతో కలిసి టేకి సచివాలయ-1 పరిధిలోని కావూరివారిపాలెం, రజకుల పేట, కాపులపేట, కమ్మ సామాజిక వర్గీయుల ఏరియాలో పర్యటించారు. ప్రజలు లేవనెత్తిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ వ్యవస్థలు బలోపేతమై సేవా దృక్పథంతో కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు సూరంపూడి వెంకటసత్యం, పుట్టా అబ్బు, రాంబాబు, బడుగు భాస్కరరావు, నరాల సూర్యనారాయణ, కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పలుచోట్ల జగనన్న సురక్ష గ్రామసభలు



నల్లూరు సురక్ష గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సుందరపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కపిలేశ్వరపురం: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నల్లూరులో సోమవారం సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సొసైటీ చెర్మన్ వల్లూరి సూర్యవెంకట కృష్ణారావు, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ సాయంతో ఇంటింటికీ వెళ్లి ఎవరికి ఏ పథకంలో లబ్ధి చేకూరుతుందో అవగాహన కల్పించి మరీ పేదలకు ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధారాణి, ఉప సర్పంచ్ మార్ని అనంతలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, నవిలే జయంతిబాబు, అతికెల శంభులింగం, వాసంశెట్టి అశోక్‌కుమార్, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

కె.గంగవరం: సీఎం జగన్ అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు నూరుశాతం అందించాలనే లక్ష్యంతో రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాటిందని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. మండలంలోని సుందరపల్లి, యండగండి గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్షలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఈ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉచితంగా అవసరమైన ధ్రువపత్రాలను పొందాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సంబంధిత ధ్రువపత్రాలను అందించారు. సర్పంచ్ తోకల మంగ, సచివాయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, కన్వీనర్లు రెడ్డి జయరాజు, పిల్లి రాంబాబు, పంపన సుబ్బారావు, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, తహసీల్దార్ వైద్యనాథశర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.గంగవరం: మండలంలో రెండు గ్రామాల్లో రేపు బుధవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోట, కూళ్ల గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



గొల్లపాలెం వైఎస్సార్ నగర్‌కు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు

కాజులూరు: గొల్లపాలెంలోని వైఎస్సార్ నగర్‌కు పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేపట్టారు. గ్రామంలో పైపులైను లీకేజీల కారణంగా వైఎస్సార్ నగర్‌కు సక్రమంగా తాగునీరు సరఫరా జరగటం లేదు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటులో భాగంగా కాలనీలో కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే పూర్తి స్థాయిలో గ్రామంలో పైపులైన్లు నిర్మాణం జరిగితే తప్ప జల్‌జీవన్ మిషన్ ద్వారా కాలనీకి తాగునీరు ఇచ్చే అవకాశం లేకపోవటంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై తాత్కాలిక చర్యల్లో భాగంగా పంచాయతీ అధికారులు సోమవారం ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమం ప్రారంభించటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేల్లో రైతుల ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలు ప్రభుత్వం అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. మండలంలోని వెల్ల గ్రామంలో రైతులతో కలసి వరినాట్లు కార్యక్రమంలో ఏఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులంతా తొందరగా వరినాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. మండలం మొత్తం మీద 6 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. ఆగస్టు మొదటి వారంలోగా మొత్తం వరినాట్లు పూర్తయ్యేలా రైతులు సన్నద్ధమవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ, శ్రీదేవి, నానిబాబు, రైతులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

గట్టుకు కంటికి రెప్పలా కాపలా



కోరుమిల్లి సమీపంలో గోదావరి గట్టు వద్ద విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు (ఫైల్)

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో విశేష కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందేందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో కూడా తెలియక ప్రజలు సతమతమయ్యేవారు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రజలకు పూర్తి సమాచారాన్ని ఇచ్చి దరఖాస్తు చేయించి, మంజూరయ్యే వరకూ తోడుగా వలంటీర్ నిలుస్తున్నాడు. ఇలా సంక్షేమ పథకాల మంజూరులోనే కాకుండా విపత్తుల వేళ ప్రజలకు అండగా వలంటీర్లు నిలుస్తున్నారు. 2020 నుంచి నేటి వరకూ వరదల సమయాల్లో గోదావరి గట్టు వెంబడి వలంటీర్లు కాపలా కాస్తూ వస్తున్నారు. గట్టు బలహీనమైన ప్రదేశాలను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందిస్తూ సాయపడుతున్నారు. గట్టు పటిష్ట పర్చాక వరద తగ్గేవరకూ గట్టు వద్ద కాపలా కాస్తున్నారు. ఇలా ప్రజలకు తోడు నీడగా నిలుస్తున్న వలంటీర్ వ్యవస్థ బాధ్యతాయుతంగా నడుస్తుంది.

-కపిలేశ్వరపురం

రేయింబవళ్లూ గట్టుకు కాపలా కాశారు



2020 వరదల సమయంలో తాతపూడి నుంచి కోరుమిల్లి వరకూ పలుచోట్ల గోదావరి గట్టు బలహీనపడినట్టు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ చర్యతో వెంటనే గట్టును పటిష్టపరిచారు. వంతుల వారీగా వలంటీర్లు గట్టును కాపలాకాసేవారు. వరద ఉధృతి తగ్గేవరకూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు విశేషంగా శ్రమించారు. -గోపి మహాలక్ష్మి, రైతు, కపిలేశ్వరపురం

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల ప్రారంభోత్సవం



నెలపర్తిపాడులో ప్రాధాన్యత భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ శీలం విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, గ్రామ పెద్దలు వాసంశెట్టి జార్జి, రాయుడు సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



బ్లడ్ గ్రూపు పరీక్ష చేయించుకుంటున్న మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్

మండపేట: కరోనా సమయంలో బాధితులకు బాసటగా నిలిచిన టీం సురక్ష సభ్యులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్ కుమార స్వామి నేతృత్వంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ప్రారంభించి తన బ్లడ్ గ్రూపు చెక్ చేయించుకున్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుంటున్న టీం సురక్ష సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ బ్లడ్ గ్రూపును తెలుసుకోవాలన్నారు. ఏదైనా ఆపద ఎదురై రక్తం అవసరమైనా, ఆపదలో ఉన్న రక్తదానం చేసేందుకు వీలుంటుందన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. కళాశాలల్లోను గ్రూపు నిర్ధారణ పరీక్షలు ఏర్పాటు చేయాలని కమిషనర్ రామ్‌కుమార్ టీం సురక్ష సభ్యులకు సూచించారు. శ్రీ వేంకటేశ్వర డయాగ్నోస్టిక్స్ ల్యాబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో సభ్యులు ఎరుబోతు ఆనంద్ కుమార్, మాంద్రు ప్రసాద్‌చౌదరి, ఎం.కిరణ్‌కుమార్, కోటిపల్లి కృష్ణమాచార్యులు, జక్కాల నరేంద్ర, పేరూరి రామకృష్ణ, బలగం గణేష్, వై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల కట్టడికి యాంటీ డెంగీ మంత్

- మండపేటలో ప్రత్యేక కార్యాచరణ
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామ్‌కుమార్

మండపేట: వర్షాకాలం ప్రారంభం అయినందున విష జ్వరాల కట్టడికి మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు యాంటీ డెంగీ మంత్ పేరిట ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. డెంగీ, మలేరియా జ్వరాల వ్యాప్తికి కారణమయ్యే దోమల నిర్మూలనకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వాల్ పోస్టర్లను ముద్రించారు. వాటిని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, సిబ్బందితో కలిసి కమిషనర్ టి. రామ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ నీటిలో మలేరియా దోమ గుడ్లు పెడితే, తాజా నీటిలో డెంగీ దోమ గుడ్లు పెట్టి దోమలను వ్యాప్తి చేస్తుందన్నారు. వర్షాకాలం దృష్ట్యా డెంగీ, మలేరియా తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలో విషజ్వరాల కట్టడికి ఇప్పటికే ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టామన్నారు. డ్రైన్లలో యాంటీ లార్వా, ఆయిల్ బాల్స్ పిచికారీ చేయిస్తున్నామన్నారు. తమ పరంగా ఎంత చేసినా ప్రజల నుంచి పూర్తి సహకారం అందితేనే జ్వరాలను అరికట్టేందుకు వీలుంటుందన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ పట్టణమంతా అతికించేందుకు వాల్‌పోస్టర్లు తయారు చేయించామన్నారు. తమ సిబ్బంది ఇంటికి వచ్చి వీటిని అతికించేటప్పుడు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ రామ్‌కుమార్ కోరారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచరలోని రెండు ఎరువులు, పురుగు మందుల షాపులలో నగదు, కంప్యూటర్ తదితర ఉపకరణాలను చోరీ చేసిన కేసులో ముద్దాయి, మండపేటకు చెందిన పెద్దప్రోలు వికాస్‌కు వారం రోజుల సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప సోమవారం తీర్పు చెప్పారు. మాచరలోని అడపా సత్యసాయిబాబుకు చెందిన షాపులో రూ.50 వేల నగదు, రూ.40 వేల విలువైన కంప్యూటర్ తదితర ఉపకరణాలను మొత్తం రూ.90 వేలు విలువైన సొత్తు చోరీకి గురయ్యిందంటూ 2020 మార్చి 3న అంగర పోలీసులకు ఫిర్యాదు అందింది. మట్టా సూర్యనారాయణ షాపులో రూ.15 వేల విలువైన కంప్యూటర్ తదితర ఉపకరణాలు చోరీకి గురయ్యాయంటూ అదే రోజు మరో ఫిర్యాదు అందింది. ఆయా ఘటనలపై అప్పటి ఎస్సై పి.కిశోర్‌కుమార్ కేసు నమోదు చేశారు. తర్వాత విధుల్లో చేరిన ఎస్సై బి.సంపత్‌కుమార్ విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప నిందితుడుకి శిక్ష విధించారు. బాధితులు తరపున ఏపీపీ విశ్వ శ్రీరాములు వాదించినట్టు ఎస్సై జి.చంటి తెలిపారు.

పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

మండపేట: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర బృందం త్వరలో మండలంలో పర్యటించనున్నందున గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఐ.రాజు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ అర్తమూరు, మెర్నిపాడు, ద్వారపూడి, వై సీతానగరాలను ఉత్తమ పంచాయతీలుగా గుర్తించినందున కేంద్రం బృందం ఆయా గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, బహిరంగ మలవిసర్జన అరికట్టేందుకు పంచాయతీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాలతోడు నుంచి వెలగతోడు వెళ్లే రోడ్డు, తాపేశ్వరం గ్రామ శివార్లలో బహిరంగ మల విసర్జన జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయడం, క్లోరినేషన్ చేయించాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీఓ రాజు ఆదేశించారు. మండల పరిపాలన అధికారి వీఎస్ఎన్ ప్రసాద్, గ్రామ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు, అంగనవాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: స్వచ్ఛ సర్వేక్షణ్ పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్స్, యానిమేటర్స్, వలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమాలు, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీల నిర్వహణ, క్లాప్ మిత్ర, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.